రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- గ్రామ పంచాయతీల సర్పంచులు సహకరించాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు ·10లో

అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సహకరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం కొమిర గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్

కొత్త సంవత్సరంలో జిల్లాకు పలు పరిశ్రమలు రాక

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక అభివృద్ధి దిశగా అనకాపల్లి జిల్లా వడివడిగా అడుగులు వేస్తున్నది. జిల్లా భారీ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది. ఇదే మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం గతంలో భూములు సేకరించిన ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం బల్క్‌డ్రగ్ పార్కును మంజూరు చేసింది. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది. ఈ మూడు ప్రాజెక్టులకు కొత్త సంవత్సరంలో శ్రీకారం చుట్టనున్నారు. లక్షన్నర కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులు రానున్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇంకా జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వపరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ
- ఇండస్ట్రియల్ కారిడార్‌లో బల్క్‌డ్రగ్ పార్కు
- అచ్యుతాపురం మండలంలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు
- రూ.లక్షన్నర కోట్లకుపైగా పెట్టుబడులు
- వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి

నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్

పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయాన్ని ఇటీవల పరవాడ మండలంలో పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారు. ఇందులో భాగంగా విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, చందనాడ, డీఎల్ పురం గ్రామాల్లో ఏపీఐఐసీ ఇప్పటికే సేకరించిన భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఇప్పటికే ముందుకు వచ్చాయి. మొదటి దశలో సుమారు రూ.70 వేల కోట్లతో 7.3 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి, 2029నాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తారు. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఇనుప ఖనిజాన్ని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని గనుల నుంచి సరఫరా చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నారు. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఇతర ముడిసరకుల దిగుమతి, ఉక్కు ఉత్పత్తుల ఎగుమతి కోసం సముద్ర తీరంలో ఓడ రేవును కూడా నిర్మిస్తారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణ సమయంలో సుమారు 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్లాంట్‌లో ఉత్పత్తి మొదలైతే 20 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.



నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రదేశం ఇదే

బల్క్‌డ్రగ్ పార్కు

నక్కపల్లి సెజ్‌లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాల్లో ఇప్పటికే పలు ఫార్మా కంపెనీలు ఉండగా.. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో 2,100 ఎకరాల్లో మరో ఫార్మా సెజ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఇక్కడ దేశ, విదేశాలకు చెందిన పలు ఫార్మా కంపెనీలు రూ.14 వేల కోట్లు పెట్టుబడులు పెడతాయని అంచనా వేస్తున్నారు. ఫార్మా సెజ్‌లో మౌలిక సదుపాయాల కల్పన పనులు ఇటీవల మొదలయ్యాయి. జనవరి 8వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నట్టు సమాచారం. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ హబ్

అచ్యుతాపురం మండలం పూడిమడక సమీపంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.85 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పూడిమడకలో 1,200 ఎకరాలు కేటాయించింది. 600 ఎకరాల్లో రోజుకు 1,100 టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేస్తారు. 300 ఎకరాల్లో ఎలక్ట్రోలైజర్లు, సోలార్ పీవీ ప్యానల్స్, బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్స్ కలిగిన ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేస్తారు. మిగిలిన 300 ఎకరాలను మౌలిక వసతుల కల్పన పనులకే కేటాయించారు. దీనికి కూడా ప్రధాని నరేంద్ర మోదీ జనవరి 8వ తేదీన శంకుస్థాపన చేస్తారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. అయితే ప్రధాని జిల్లా పర్యటనకు వస్తారా? లేకపోతే వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారా? అన్నది ఇంకా ఖరారు కాలేదు.



అచ్యుతాపురం మండలం పూడిమడక సమీపంలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌కు కేటాయించిన భూమి

మునిసిపల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా

అయ్యన్న ప్రమాణ స్వీకారం

చైర్‌పర్సన్, ఇద్దరు వైస్ చైర్మన్లు, 9 మంది వైసీపీ కౌన్సిలర్లు డుమ్మా

- వైసీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు హాజరు
- చైర్‌పర్సన్ గైర్హాజరుపై స్పీకర్ అసహనం
- కీలకమైన బడ్జెట్ సమావేశానికి రాకపోవడం సంస్కారం కాదని చురక

నర్సీపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఎమ్మెల్యే, శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పురపాలక సంఘం ఎక్స్‌అఫీషియో సభ్యునిగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. మునిసిపల్ బడ్జెట్ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడుతోపాటు వైసీపీకి చెందిన తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాలేదు. తొలుత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కౌన్సిల్ నివాళులు అర్పించింది. అనంతరం అయ్యన్న పాత్రుడు మాటాడుతూ, తాను మునిసిపల్ పాలకవర్గం ఎక్స్ అఫీషియో సభ్యునిగా డిసెంబరు 31వ తేదీన బడ్జెట్ సమావేశం సందర్భంగా ప్రమాణస్వీకారం చేస్తానని వారం రోజుల క్రితమే స్పీకర్ హోదాలో లిఖిత పూర్వంగా కమిషనర్‌కు లేఖ రాశానని చెప్పారు. ఈ మేరకు కమిషనర్ సర్క్యులర్ జారీ చేశారని, అయినప్పటికీ చైర్‌పర్సన్ హాజరుకాక పోవడం సంస్కారం కాదని అన్నారు. 28 మంది సభ్యులు వున్న పాలకవర్గంలో ఎక్స్‌అఫీషియో మెంబర్‌తో కలుపుకొని 15 మంది హాజరయ్యారని, కోరం సరిపోయినందున చైర్‌పర్సన్ లేకపోయినా కౌన్సిల్ సమావేశం నిర్వహించుకోవచ్చునని స్పీకర్ ప్రకటించారు. కీలకమైన బడ్జెట్ సమావేశానికి చైర్‌పర్సన్ హాజరుకాకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. శాసన సభ స్పీకర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ... మిగతా 10వ పేజీలో



మునిసిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అయ్యన్నపాత్రుడు

వైసీపీకి షాక్

- జనసేనలో చేరనున్న మాజీ చైర్‌పర్సన్, మాజీ వైస్ చైర్మన్

నర్సీపట్నంలో వైసీపీకి షాక్ తగలనుంది. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. వీరితోపాటు ఆదిలక్ష్మి సోదరుడు, వైసీపీ ముఖ్య నేత నాగేశ్వరరావు సంక్రాంతి పండగ తర్వాత మంచి రోజు చూసుకొని జనసేన కండువా కప్పుకోనున్నారు. వైసీపీ పెద్దల సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకు వీరిద్దరూ సుమారు రెండేళ్ల క్రితం పదవుల నుంచి వైదొలిగారు. అప్పటి నుంచి వైసీపీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. కాగా 18వ వార్డు వైసీపీ కౌన్సిలర్ శెట్టి విజయాంబ గత సాధారణ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. మాజీ చైర్‌పర్సన్, మాజీ వైస్‌చైర్మన్ కూడా పార్టీని వీడితే కౌన్సిల్‌లో వైసీపీ బలం 11కి పడిపోతుంది. కూటమి బలం 17కి చేరుతుంది.

న్యూ ఇయర్ సందడి

- అనకాపల్లిలో రద్దీగా మారిన స్వీట్స్, పూలు, పండ్లు, బేకరీ దుకాణాలు



నెహ్రూచౌక్‌లో బొకేలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో మంగళవారం సాయంత్రం నుంచే నూతన సంవత్సర సందడి మొదలైంది. పూలు, పండ్లు, మిఠాయిలు, డ్రై ఫ్రూట్స్, కేకులు విక్రయించే దుకాణాల్లో కొనుగోలుదారులు పెరిగారు. వినియోగదారులను ఆకట్టుకునేలా వ్యాపారులు రకరకాల స్వీట్స్ తయారు చేసి దుకాణాల్లో అందుబాటులో వుంచారు. పండ్లు, పూల వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో సరకు రప్పించారు. నూతన సంవత్సరం మొదటి రోజున స్నేహితులు, బంధువులు, పై అధికారులకు అందజేయడానికి పూల బొకేలు, మిఠాయిలు, డ్రైఫ్రూట్స్ పండ్లు, కేకులు కొనుగోలు చేశారు. సాధారణ రోజులతో పోలిస్తే వీటి ధరలు స్వల్పంగా పెరిగాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలువురు మహిళలు మంగళవారం రాత్రే ఇళ్లముందు రంగవల్లులు వేశారు. హోటళ్లు, రెస్టారెంట్లలో స్పెషల్ వంటకాలను అందుబాటులో వుంచారు. కొన్ని రెస్టారెంట్లలో వినియోగదారులను ఆకట్టుకోవడానికి బిర్యానీ కొనుగోలు చేసిన వారికి కాంప్లిమెంటరీగా కూల్ డ్రింక్ బాటిల్‌ను ఆఫర్‌గా పెట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్పులతో వేడుకను ఉల్లాసంగా జరుపుకోవడానికి యువత ఏర్పాట్లు చేసుకున్నారు.

విశాఖ రేంజ్‌లో

ఏడుగురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి?

- డీజీపీకి జాబితా



విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీలుగా పదోన్నతికి అర్హులైన సీఐల జాబితాను అధికారులు మంగళవారం రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావుకు పంపించారు. ఆయన ఆమోదించి త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది. అధికారులు తయారుచేసిన సీనియారిటీ జాబితాలో విశాఖ రేంజ్ పరిధిలో సీఐలుగా పనిచేస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన పీవీవీ నరసింహరావు, వి.బాబ్జీరావు, ఎస్.ఆదం, ఆర్.నీలయ్య, జి.వెంకటరమణ, వి.చంద్రశేఖర్. టి.సీతారాం, ఎం.బుచ్చిరాజు, ఎస్.కాంతారావు పేర్లు ఉన్నాయి. వీరికి అడ్‌హాక్ పదోన్నతి లభించనుంది. వీరంతా 2009లో సీఐలుగా పదోన్నతి పొందారు. డీఎస్పీ పదోన్నతి కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు.

పెరిగిన నేరాలు!

2023తో పోలిస్తే అధికమైన హత్యలు

- తగ్గని రోడ్డు ప్రమాదాలు, మరణాలు
- రెట్టింపు అయిన సైబర్ నేరాలు

కాలచక్రం 2024 క్రైమ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో శాంతి భద్రతలు గత ఏడాది (2023) కంటే కాస్త మెరుగుపడినప్పటికీ, నేరాలు మాత్రం తగ్గలేదు. హత్యలు, హత్యాయత్నాలతో పాటురోడ్డు ప్రమాదాలు పెరిగాయి. గంజాయి, సైబర్ నేరాలు, సారా కేసులు అధికం అయ్యాయి. కుటుంబ తగాదాలు, వివాహేతర సంబంధాలు, ఆస్తి కోసం హత్యలకు పాల్పడడం వంటి సంఘటనలు కూడా పెరిగాయి. 2024లో వివిధ నేరాలకు సంబంధించి జిల్లా పోలీసులకు 4,618 ఫిర్యాదులు అందగా 2,734 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 2023లో 15 హత్యలు జరగ్గా 2024లో 25 హత్యలు జరిగాయి. 2023లో 25 హత్యాయత్నం కేసులు నమోదు కాగా 2024లో 38 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత ఎస్పీ తుహిన్ సిన్హా నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టారు. 2024కు సంబంధించి నేరాల వివరాలను మంగళవారం వెల్లడించారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

గత ఏడాది (2023) జిల్లాలో 689 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 294 మంది మృతిచెందారు. 2024లో 696 రోడ్డుప్రమాదాల్లో 316 మంది మృత్యువాతపడ్డారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జాతీయ రహదారిపై 26 బ్లాక్ స్పాట్‌లను గుర్తించి స్టాపర్ బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారి భద్రత చర్యల్లో భాగంగా 4,332 కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 12,282 కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చలానాలు విధించారు.



నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో వుంటున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి ఇంటిలో డిసెంబరు 25వ తేదీన 80 గ్రాముల బంగారం, రూ.8.2 లక్షల నగదు చోరీకి గురైన బీరువాను పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్ (ఫైల్ ఫొటో)

పెరిగిన నాటుసారా కేసులు

జిల్లాలో 2023వ సంవత్సరంలో 5,906 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 178 కేసులు నమోదు చేసి 119 మందిని అరెస్టు చేశారు. 2024లో 4,842 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 277 కేసులు నమోదు చేశారు. 308 మందిని అరెస్టు చేశారు. 2,09,100 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. బెల్ట్ షాపుల నుంచి 12,445 లీటర్ల ... మిగతా 10వ పేజీలో

పెన్షన్లు పంపిణీ చేసిన కలెక్టర్

కొత్తూరు (అనకాపల్లి) డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం అనకాపల్లి మండలంలోని కొత్తూరు పంచాయతీలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా పలువురిని ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, ఎంపీడీవో కె.వి నరసింహారావు, సర్పంచ్ సప్పారపు ప్రసన్నలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో వృద్ధురాలికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

టీడీపీ నేతలపై దాడి కేసులో నిందితుల అరెస్టు

..... వివరాలు 10వ పేజీలో

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు ·10లో

- వాడపాలెం, సీతంపాలెం బీచ్‌ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి
- కొండకర్ల ఆవలో ఎకో టూరిజం
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

హామీలన్నీ నెరవేరుస్తాం

- ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ
- పింఛన్ల పంపిణీలో సబ్బవరం మొదటి స్థానం

సబ్బవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో సోమవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అన్నారు. జనవరి 1న సెలవులు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజన్‌తో ముందుకు సాగుతున్నారని, రానున్న రోజుల్లో రాష్ట్రం మరో ఎత్తుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా పంచన్ల పంపిణీలో జిల్లాలోనే సబ్బవరం మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. మండలంలో 8129 పింఛన్లు ఉండగా 7921 (97.44 శాతం) మంది లబ్ధిదారులకు అందించినట్టు చెప్పారు. వివిధ కారణాల వల్ల 208 అందుబాటులో లేకపోవడంతో ఇవ్వలేకపోయామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.బంగారునాయుడు, ఎ.నానాజీ, టి.సత్యనారాయణ, రాంబాబు, రాము, నరేశ్, సత్యం, శ్రీరాములు, రాజు, దేవుడు, అర్జున పాల్గొన్నారు.

ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ: బుద్ద

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్టు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు చెప్పారు. పట్టణంలో 84వ వార్డు పరిధిలోని గొల్లవీధి ప్రాంతంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జనవరి ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్‌ను నూతన సంవత్సరం సందర్భంగా ఒకరోజు ముందుగానే ఇంటి వద్దనే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, కిడ్నీ రోగులకు పంపిణీ చేయడమైందన్నారు. నవంబరు నెలలో కూడా డిసెంబరుకు సంబంధించి ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం పథకాలు పంపిణీ చేయడమే లక్ష్యంగా కూటమి నేతలు ముందుకు వెళ్తున్నారన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు



మొగలిపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

అలాగే పలు వార్డుల్లో సచివాలయాల సిబ్బందితో టీడీపీ నేతలు దగ్గరు ఉండడంతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుప్పిలి జగన్మోహనరావు, వానపల్లి త్రినాథ్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లను పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు మంగళవారం ముత్యాలమ్మపాలెంలో పంపిణీ చేశారు. జనవరి నెల ఒకటో తేదీ నూతన సంవత్సరం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, పంచాయతీ కార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు. అలాగే గొర్లివానిపాలెం, నాయుడుపాలెం, రావాడలో ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. కాగా, మండల వ్యాప్తంగా ఉదయం ఐదు గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

ఐకమత్యమే సంఘ బలం

- ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకులు జోషి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏ సంఘానికైనా సభ్యుల్లో ఐకమత్యమే మహా బలమని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకులు జంగం జోషి అన్నారు. పట్టణంలోని ఓ ల్యాబ్‌లో మంగళవారం జరిగిన ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణకు, కుటుంబాల సంక్షేమానికి 14 మందితో ప్రారంభించిన ఈ సంఘం, అందరి సహకారంతో సుమారు 1500 మంది సభ్యులు ఉండడానికి కారణం ఐకమత్యమేనన్నారు. ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకునే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జోనల్ గౌరవాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, సలహాదారుడు కోన ప్రకాశ్, విశాఖ జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ పాల్గొన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరు జంక్షన్‌లో సోమవారం రాత్రి ఓ వ్యక్తి నుంచి పది క్వార్టర్ సీసాలతో మద్యం స్వాధీనం చేసుకున్నట్టు మంగళవారం పట్టణ ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తూరు జంక్షన్‌లో సిబ్బంది తనిఖీలు చేస్తుండగా తాళ్లపాలెంకు చెందిన పి.సూర్యప్రకాశ్ వద్ద పది మద్యం సీసాలను హెడ్ కానిస్టేబుల్ పట్టుకున్నారన్నారు. ఈ మేరకు సూర్యప్రకాశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

బయ్యవరంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కశింకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులకు పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పీలా గోవింద



కేక్ కట్ చేస్తున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

కొత్త ఆకాంక్షలతో ముందుకుసాగాలి

- పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య
- న్యాయవాదుల న్యూ ఇయర్ వేడుకలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో కొత్త ఆకాంక్షలతో ముందుకు సాగాలని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య సూచించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీవిద్య మాట్లాడుతూ గత కాలాన్ని జ్ఞాపకాలుగా నిలుపుకొని ముందున్న సవాల్‌ను ఎదుర్కొనే దిశగా అడుగులు వేయాలని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, మొదటి తరగతి అడిషనల్ సివిల్ జడ్జి రమేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, అధ్యక్షులు కుమార్, సెక్రటరీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అటల్‌జీ మండల అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి సన్యాసిరావు

కొత్తూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి సంస్థాగత అటల్‌జీ మండల అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి సన్యాసిరావు ఎన్నికయ్యారు. గవరపాలెంలోని బీజేపీ సీనియర్ నాయకుడు కొణతాల అప్పలరాజు నివాసం వద్ద మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొణతాల రాజబాబు తదితర పార్టీ నేతలు పాల్గొని సన్యాసిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వరూప్, బొడ్డేడ నాగేశ్వరరావు, కొండబాబు, చలపతిరావు, రాము, మారిశెట్టి భాస్కరరావు, సంతోష్‌యాదవ్, కుమార్, పండు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఈయూ ధర్నా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీడీ డిపో ఎదుట మంగళవారం కూడా ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ ధర్నా చేపట్టారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేసి తిరిగి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, రూట్ సర్వేలు జరిపి రన్నింగ్ టైమింగ్స్ సరి చేయాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని నినాదాలు చేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు పి.రాజేశ్వరరావు, కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన గేటు మీటింగ్‌లో జిల్లా కార్యదర్శి డీఎన్ మూర్తి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎన్‌ఈఎస్‌ఏ.రావు, కేఏ.రావు, డీవీ గణేశ్, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల జిల్లా సదస్సుకు తరలిరండి

పరవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ఈ జనవరి 10వ తేదీన నిర్వహించనున్న రవాణా రంగ డ్రైవర్లు, కార్మికుల సదస్సుకు తరలిరావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పరవాడలోని ఆటో కార్మికులతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో రవాణారంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రంగంలో పనిచేసే ఆటో, మోటార్, బస్, లారీ, వ్యాన్‌ల ద్వారా ప్రయాణికులతో పాటు సరుకులను చేరవేస్తున్నారని, వీరి సమస్యల పరిష్కారం కోసమే జిల్లా స్థాయిలో సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సుకు అఖిలభారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య హాజరవుతారన్నారు. డ్రైవర్లు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వీవీ శ్రీనివాసరావు, పి.అప్పలరాజు, చిన్ని రమేష్, పరమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ముళ్ల పొదల తొలగింపు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



తుప్పలు తొలగించిన తర్వాత పరిశుభ్రంగా తయారైన కలపాక శ్మశానవాటిక ప్రాంగణం

పరవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కలపాక పంచాయతీ అధికారులు స్పందించారు. ఏళ్ల తరబడి కలపాక శ్మశానవాటికలో ఏపుగా పెరిగిపోయిన ముళ్ల పొదలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. 'ఆఖరి మజిలీకి అవస్థలే... ముళ్ల పొదలతో నిండిపోయిన కలపాక శ్మశానవాటిక' అనే శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో పంచాయతీ అధికారుల్లో కదలిక వచ్చింది. శ్మశానవాటిక షెడ్డు చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. అలాగే ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా తయారు చేశారు. షెడ్డులో బోరు చుట్టు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. సర్పంచ్ బొండా కనకారావు, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. శ్మశానవాటికను పరిశుభ్రంగా తయారు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లికి నూతన సంవత్సర శోభ

▸▸ పండ్లు, పూలు, మిఠాయి దుకాణాలు కళకళ




జీవీఎంసీ కార్యాలయం వద్ద కేకులు కొనుగోలు చేస్తున్న దృశ్యం... నెహూచౌక్‌లో బొకేలు కొనుగోలు చేస్తున్న జనాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లికి నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. మంగళవారం ఉదయం నుంచి పట్టణంలోని పలు వ్యాపార కేంద్రాలు నూతన సంవత్సరానికి అవసరమయ్యే అమ్మకాలకు సిద్ధమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఇళ్ల ముందు మహిళలు ముగ్గులు వేయడానికి అవసరమైన వివిధ రంగులను కొనుగోలు చేశారు. అలాగే నూతన సంవత్సరం రోజున తమ అభిమాన నాయకులు, స్నేహితులు, బంధువులకు నూతన సంవత్సరం శుభకాంక్షలు చెప్పేందుకు వెళ్లేవారితో దుకాణాల్లో సందడి కనిపించింది. ముఖ్యంగా బేకరీలు, పూలదండలు, పూల బొకేలు, వివిధ రకాల పండ్లు, మిఠాయి దుకాణాలు రద్దీగా మారాయి. తోచిన స్థాయిని బట్టి వివిధ రకాల పండ్లు, మిఠాయిలు, పూలదండలు, కేకులను ప్రజలు కొనుగోలు చేశారు. మంగళవారం చీకటిపడిన తరువాత నుంచి పలు ప్రాంతాల్లో మహిళలు నూతన సంవత్సరం శుభాకాంక్షలు-2025ను ఆహ్వానాన్ని పలుకుతూ ముగ్గులు వేయడంలో నిమగ్నమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి యువత నూతన సంవత్సరం వేడుకల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

> **నేటి నుంచి అమలు**
> **జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్**
> **విక్రయించినా, వినియోగించినా వ్యాపారులకు జరిమానా**
> **పదిహేను రోజుల తర్వాత వినియోగదారులకు కూడా...**
> **నగరాన్ని సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ రహితంగా మార్చడమే లక్ష్యం**

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖను సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ రహిత నగరంగా తయారుచేయాలని కొత్త సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం రోజుకు 15 టన్నుల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. అందువల్ల బుధవారం నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. ప్రతి దుకాణం వద్ద ఒక క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికిస్తామన్నారు. ఆ కోడ్‌ను స్కాన్ చేయగానే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల నష్టాలు, ప్రత్యామ్నాయమైన బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ అందుబాటులో ఉండే ప్రాంతాల సమాచారం లభిస్తుందన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగదారులకు అందజేసినా జరిమానా విధిస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. వీధి వ్యాపారులు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడుతూ పట్టుబడితే మొదటిసారి రూ.2,500, రెండోసారి అయితే రూ.ఐదు వేల జరిమానా విధిస్తామన్నారు. మూడోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదుచేసే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. అదే దుకాణాలు, వ్యాపార సంస్థలు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడుతూ పట్టుబడితే మొదటిసారి రూ.25 వేలు, రెండోసారి అయితే రూ.40 వేలు జరిమానా విధిస్తామన్నారు. మూడోసారి పట్టుబడితే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి వారి కుటుంబంలో మరెవరికీ లైసెన్స్ ఇవ్వకుండా నిషేధం విధిస్తామన్నారు. ప్రతి సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీ అధ్యక్షతన ప్లానింగ్ సెక్రటరీ, మహిళా పోలీస్‌తో కూడిన కమిటీ, ఆ పరిధిలోని రీసోర్స్‌పర్సన్లు ఇంటింటికీ వెళ్లి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయాలను వివరిస్తారన్నారు. పదిహేను రోజుల తర్వాత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడితే వినియోగదారులకు కూడా జరిమానా విధిస్తామన్నారు. ప్రతి వెండింగ్ జోన్‌లోనూ బయోడీగ్రేడబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2025లో జీవీఎంసీని సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మేయర్, కార్పొరేటర్లతో కలిసి పనిచేస్తానన్నారు.



కశింకోట కూడలిలో ఉన్న డివైడర్‌ను తొలగిస్తున్న సీఐ, పోలీసులు

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు

▸▸ కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న కశింకోట కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నామన్నారు. కశింకోట గ్రామం నుంచి నేరుగా జాతీయ రహదారికి వచ్చేక్రమంలో డివైడర్ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడేదన్నారు. జాతీయ రహదారిపై వచ్చే వాహనాల రాకపోకలకు, గ్రామం నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా కూడలిలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణకు మధ్యలో ఉన్న డివైడర్‌ను తొలగించామని సీఐ తెలిపారు. అంతేకాకుండా ఈ కూడలిలో ప్రమాదాలు జరగకుండా స్టాప్ బోర్డులు, ప్రమాద సూచికలు తెలిపే బోర్డులను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

మామిడిపాలెంలో గణిత మేళా

తుమ్మపాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల స్థాయి గణిత మేళా ఘనంగా నిర్వహించారు. మూడు నుంచి పదో తరగతి వరకు సుమారు 300 విద్యార్థులు గణిత నమూనాలను తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస్ రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం హెచ్‌బీ.శ్రీధర్ మాట్లాడుతూ గణితం అత్యంత ప్రాముఖ్యత కలిగిన సబ్జెక్టని, పిల్లలు గణితంలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. గణిత ఉపాధ్యాయుడు బాబు మాట్లాడుతూ పిల్లలు తయారు చేసిన గణిత నమూనాలు వాళ్లలో సృజనాత్మకతకు నిదర్శనమన్నారు. అనంతరం ఉత్తమ గణిత నమూనాలను ఎంపిక చేసి, వాటిని తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

సబ్బవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి పశువులు పాకలను దగ్ధం కావడంతో ఆర్థిక నష్టపోయిన రైతులు దేవుడమ్మ, గేదెల శ్రీనివాసరావుకు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం సహాయం అందించారు. రూ.10 వేల నగదును బాధితులకు పంపిణీ చేశారు. పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.రాము, కర్రి బాబు, బి.కనకరాజు, సురేశ్‌రాజ్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నిరసన

సబ్బవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సీపీఎం నేతలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ ఎన్నికల ముందు చార్జీలు పెంచబోమని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌరీను, పప్పులు కోటి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

పరవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ సూచించారు. మండలంలోని మూలస్వయంభూవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్క రెవెన్యూ సమస్యను సదస్సు ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. అర్జీలను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. మూలస్వయంభూవరంలో 16 మంది నుంచి అర్జీలను స్వీకరించామని తహసీల్దార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండా కనకారావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో నారాయణమ్మ, స్థానిక నాయకులు కొత్తపల్లి బాబూరావు, నాయుడు, రైతులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే సదస్సులు

సబ్బవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని లగిశెట్టిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని రైతులు వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలను ఆన్‌లైన్ చేసి, వివాదాలు లేకుండా 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో అప్పలరాజు, వెలుగు సర్వేయర్ రాంబాబు, సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, గ్రామ నాయకులు పాలిశెట్టి సురేశ్‌రాజ్, బంగారయ్య, ఆడారి నాగరాజు, వెంకట్, కె.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సంపతిపురంలో 20 అర్జీలు స్వీకరణ

కొత్తూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ విజయకుమార్ సదస్సులో పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలైనా సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. మ్యుటేషన్లు, భూముల విస్తీర్ణం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 20 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు గణేశ్ రైతులు పాల్గొన్నారు.

ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీ



నక్కపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం ఆరు గంటలకే అధికారులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. జనవరి పింఛన్‌ను డిసెంబరు 31వ తేదీన ప్రభుత్వం అందజేసింది. నక్కపల్లి, ఉపమాకలో ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.































పెట్టుగోళ్ళపల్లిలో రెవెన్యూ సదస్సు

ఎస్.రాయవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్ళపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆరు వినతులు అందాయని తహసీల్దార్ జె. రమేష్‌బాబు తెలిపారు.







13 మంది మద్యం విక్రయదారుల బైండోవర్

అచ్యుతాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 మంది అక్రమ మద్యం విక్రయించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ పి. తేజో వెంకట కుమార్ తెలిపారు. వీరిని తహసీల్దార్ జీవీ జనార్ద న్ వద్ద హాజరు పరచి బైండోవర్ కేసులు నమోదుచేశామన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు శ్రద్ధ చూపాలి

కోటవురట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని డిప్యూటీ ఈడీవో అప్పారావు సూచించారు. మంగళవారం కోటవురట్ల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రతీ టీచర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

శ్రీరాంపురం గ్రామకంఠంలో హెచ్చరిక బోర్డులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని సర్వే నంబరు 17/1లో 2.61 ఎకరాల గ్రామ కంఠంలో ఆక్రమణలు గురి కాకుండా రెవెన్యూ అధికారులు త్రినాధరావు, శ్రీనివాసరావు మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి నిర్ణయించారు. అయితే గ్రామంలోని పేదలకు ఎస్.నర్సాపురంలో ఇళ్ళ స్థలాలు కేటాయించారు. దీనిపై సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో 185 అర్జీలు

పాయకరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలు పరిష్కారం కోరుతూ 185 అర్జీలు అందాయని తహసీల్దారు సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మండలంలో డిసెంబరు 6 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల్లో కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించామన్నారు. మంగళవారం పాయకరావుపేటలో నిర్వహించిన సదస్సులో 2 దరఖాస్తులు వచ్చాయి.

'భూ సమస్యలకు పరిష్కారం'

మునగపాక, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని రకాల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని జిల్లా సర్వేయర్ ఎస్.గోపాల్‌రాజ్ అన్నారు. మండలంలో వాడ్రాపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రజల అర్జీలను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. అవసరమైన చోట్ల రీ సర్వే నిర్వహిస్తామన్నారు. స్థానిక తహసీల్దార్ మహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మళ్ల వరహా నర్సింగరావు, కాండ్రేగుల నూకఅప్పారావు, సూరిశెట్టి రాము, రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన

అచ్యుతాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఆటో, మోటార్ రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు అన్నారు. సోమవారం ఆటో, మోటారు కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ ప్రైవేటు సంస్థలకు అప్పగించటం వల్ల మోటారు కార్మికులపై మరింత భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కట్ట రాజు, చండి, రమేష్ పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

మునగపాక, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో 95 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. అన్ని రకాల పింఛన్‌లకు 8,397 లబ్ధిదారులు ఉన్నారని, 95 శాతం పింఛన్లు అందజేశామన్నారు.

అర్బన్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎలమంచిలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సీఎంఎం పద్మావతి మాట్లాడుతూ.. డ్వాక్రా సభ్యులు నాణ్యతతో తయారు చేసిన వస్తుసామగ్రిని విక్రయించేందుకు ఈ మార్కెట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులు మైస్టోర్ యాప్ ద్వారా ఆన్ బోర్డింగ్ చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు, సీసీలు పాల్గొన్నారు.









మండల వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ఎస్.రాయవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో 14 హైస్కూళ్ల విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఇన్‌చార్జి ఎంఈవో సత్తిబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు









అపరాల సాగులో సస్యరక్షణ చేపట్టాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు అపరాల సాగులో సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ కె.ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటనగరం, శ్రీరాంపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు, వరి కోతలు కోసిన అనంతరం అపరాలు సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు రైతులకు వివరించారు. అదే విధంగా వరి పనలు ఆరకుండా వరి కుప్పలు వేసిన రైతులు ఒక్కసారి కుప్పలను పరిశీలించుకోవాలన్నారు.










'న్యాయమైన విద్య అందుబాటులో ఉండాలి'

పాయకరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు న్యాయమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలని వీపీఎం అకాడమి ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డీన్ డాక్టర్ సుధాకర్ సి అగార్కర్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీసెస్ డిగ్రీ కళాశాలలో 'జాతీయ విద్యా విధానం-2020'పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ నిరంతర ప్రగతికి, ఆర్థికాభివృద్ధికి, సామాజిక న్యాయం, సమానత్వం, వైజ్ఞానిక ఉన్నతి, జాతీయ సమైక్యతా, ప్రపంచ వేదికపై నాయకత్వం వహించేందుకు న్యాయమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్నారు.విద్యా వ్యవస్థలో మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్‌కే.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై వజ్రకవచధరుడు

నక్కపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో మంగళవారం ఆంజనేయ వాహనంపై వజ్ర కవచధరుడైన వెంకన్న ఉభయ దేవేరులతో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకీలో గోదాదేవి అమ్మవారిని తిరువీధి సేవ నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



















'పిల్లలకు సంప్రదాయాలు తెలపాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతోపాటు సంప్రదాయాలు, ఆచారాలను పిల్లలకు తెలియజేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ విద్యాశాఖ అధికారి కె. గౌరీపతి అన్నారు. మంగళవారం వాడపాలెం బీచ్‌లో 1988-89లో అచ్యుతాపురం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు కలిశారు. ఈ పాఠశాలలోనే అప్పటి హెచ్‌ఎంగా పనిచేసిన గౌరీపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు విద్యకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. అనంతరం గౌరీపతి, కృష్ణానంద్, పల్లి శేషగిరిరావు లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్రి నాగేశ్వరరావు, మాడెం సూరి అప్పారావు, గండి చిన్నం నాయుడు, కిర్లంపల్లి శ్రీనివాస్, ఈగల శ్రీను, ధర్మిరెడ్డి రమణ, అలుగు సంధ్య, ఎస్. అప్పారావు, డి.సన్యాసినాయుడు, గొర్లె రామజోగి, కె.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.





















రక్తదానంలో భాగస్వాములు కండి

- శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


ఏటిగైరంపేటలో రక్తదాన శిబిరంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న మరొకరి ప్రాణాన్ని కాపాడుకోవచ్చని, అందుకోసం ప్రతి ఒక్కరూ రక్తధానంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మండలంలోని ఏటిగైరంపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నూకరాజు అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకుడని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నాయకులు రాజాన సూర్యచంద్ర, తెలుగుయువత అధ్యక్షుడు కర్రినాయుడు, ఎంపీటీసీ సభ్యులు చింతల కాంతం, టీడీపీ నాయకులు కొల్లు సత్తిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా వేయాలని లేఖ రాశా: చైర్‌పర్సన్

నర్సీపట్నం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాలు ఉండడంతో బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని కమిషనర్ లేఖలో చెప్పామని చైర్‌పర్సన్ బి.సుబ్బలక్ష్మి తెలిపారు. సంతాప దినాల కార ణంగా కొత్త సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, ఆ ఉద్దేశంతోనే వాయిదా వేయాలని కోరానని చెప్పారు.






























డైరీని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

నర్సీపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ-2025 డైరీ, క్యాలెండర్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. మంగళవారం పార్టీ క్యాంప్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం మండల అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో 95.37 శాతం పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో మంగళవారం సాయంత్రానికి 95.37 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశామని 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ తెలిపారు. పట్టణంలో మొత్తం 7066 పింఛన్లకు 6739 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. ఇంకా 327 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, నాయకులు కుప్పిలి స్వామి, బేరా శేఖర్, మాపాతిన శంకరరావు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో 95.3 శాతం పంపిణీ

మాకవరపాలెం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 95.3 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంతో పాటు తామరం, రాచపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ఒక్క రోజు ముందే తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి పంపిణీ ప్రారంభించామని చెప్పారు. మండల వ్యాప్తంగా 1,033 మంది పింఛన్లు దారులకు రూ.4.22 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో దాదాపుగా పింఛన్‌దారులందరికీ పంపిణీ పూర్తయిందని ఆమె వివరించారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారికి మాత్రమే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం ఈవో బాలదొర పాల్గొన్నారు.

చీడికాడలో 95 శాతం...

చీడికాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 పంచాయతీల్లో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. మండలంలోని అప్పలరాజుపురం సచివాలయం వద్ద కొత్తగా పింఛన్ మంజూరైన వారికి నగదును ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు కురచా సురేష్ అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 8,576 పింఛన్‌లుండగా సాయంత్రానికి 8,144 పింఛన్‌లు పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వీర్రాజు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం


సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో అడిగర్ల రాజు అధ్యక్షతన జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన జి.కోటేశ్వరావుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షకుల తరపున సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శిగా పార్టీ సిద్ధాంతాలకు, ఆశయ సాధనకు కట్టుబడి పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రుత్తల శంకరరావు, ఈరెల్లి చిరంజీవి, ఎల్.గౌరి తదితరులు పల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రావికమతం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో 400 మంది నిరుపేదలకు చీరలు, రగ్గులు, పంచెలు, తువ్వాలను జోష్ మిషన్ డైరెక్టర్ కె.వర్గీస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్గీస్ మాట్లాడుతూ,పేదలకు సేవలు చేయాలనే సంకల్పంతోనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోష్ మిషన్ ప్రతినిధి వసంత,విదేశీ ప్రతినిధులు క్రిస్టియానా, డేవిడ్ మార్టిన్, కేథరిన్, మేరీ, ఉపసర్పంచ్ సింహాద్రి పాల్గొన్నారు.

అధ్వానంగా గుమ్మిడిగొండ రోడ్డు


గోతులతో ప్రమాదకరంగా తయారైన గుమ్మిడిగొండ-నాతవరం రోడ్డు

నాతవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గుమ్మిడిగొండ-నాతవరం తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాలకు చాలా చోట్ల గోతులు పడ్డాయి. దీంతో రాత్రి వేళలలో ప్రయాణానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు గోతులకు కొన్నిచోట్ల మరమ్మతు చేసి, మరికొన్ని చోట్ల వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రాథమిక విద్య పద్ధతులను కొనసాగించాలి

▸▸ ఐఐటీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ రాజశేఖర్

చోడవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో అనేక పద్ధతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఆ పట్టు కొనసాగించడం లేదని, దీనివల్ల గ్రామీణప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలకు దూరంగా ఉండిపోతున్నారని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీపీ.రాజశేఖర్ అన్నారు. స్థానిక ఉషోదయ కళాశాలలో గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలో విద్యార్థికి గట్టి పునాది వేసి, అదేస్థాయిలో సరైన బోధనా ప్రమాణాలు పాటించగలిగితే ఐఐటీ వంటి జాతీయ పరీక్షలను సులభంగా అధిగమించే అవకాశం ఉంటుందన్నారు. నిజజీవితానికి ఉపయోగపడేలా సృజనాత్మక అంశాలతో కూడిన బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ శిక్షణలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, బీఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమణాజీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, డీన్ ఎస్వీ.వాసు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు ఎమ్మెల్యే రాజు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన తెలుగు యువత మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠ, అతని సోదరుడు శ్రీనివాసరావులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పరామర్శించారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రాజు వెంట విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల దుస్థితిపై సీపీఐ ఆందోళన



రహదారుల దుస్థితిపై నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

చోడవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల దుస్థితిని మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులు స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. రహదారులు అత్యంత దారుణంగా ఉండడం వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారుల్లో గానీ, ప్రజాప్రతినిధుల్లో గానీ చలనం లేకపోవడంపై సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చోడవరం-అనకాపల్లి-విశాఖపట్నం వెళ్లే రహదారిలో ఇరుకు వంతెనల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు కనీస రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ఎంవీ స్వామి



చోడవరం, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ఎంవీ. స్వామి(లక్కవరం) నియమితులయ్యారు. మంగళవారం మండల నూతన కార్యవర్గాన్ని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ ప్రకటించారు. మండల శాఖ మహిళా అధ్యక్షురాలిగా ఎం. వసుంధర, ప్రధాన కార్యదర్శిగా కేఎల్ఎన్ గణేశ్వరరావు, జిల్లా కౌన్సెలర్లుగా కె. త్రినాథరావు, ఏఎల్వీ ఈశ్వరి, కార్యదర్శులుగా బి.కృష్ణారావు, బి. హైమవతి, ఆడిట్ కమిటీ అధ్యక్షులుగా జీవీ రమణారావు నియమితులయ్యారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస మేలుకొలుపులు

కె.కోటపాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడలో ధనుర్మాసం ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నాలుగు నుంచి ఆరు గంటల వరకు రాములవారి విగ్రహాలతో సంకీర్తనలు, భజనలు చేస్తూ మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్లు : బండారు



పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండలంలో మంగళవారం ఉదయం కె.సంతపాలెంలో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీడీవో సాంబశివరావు, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, వాకాడ చిన్న, బొడ్డు అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన కాలనీ ఇళ్లను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని తిమిరాంలో కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షా 80 వేలుకు అదనంగా మరో రూ.లక్ష ఇస్తామన్నారు. కార్యక్రమంలో రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, మాజీఎంపీపీ కిలపర్తిభాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, ఈర్లె శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సాంబమూర్తి సమకూర్చిన చీరలను ఆయన పేదలకు పంచారు.

ఎట్టకేలకు పెద్దగెడ్డ వంతెన పనులు ప్రారంభం



ఎక్స్‌కవేటర్‌తో వంతెన పనులు చేస్తున్న దృశ్యం

రోలుగుంట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం-వడ్డిప రహదారిలో ఉన్న పెద్దగెడ్డపై వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. దీని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నో ఏళ్లగా పెద్దగెడ్డపై వంతెన లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోజుల తరబడి వరద ఉధృతి ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోయేవి. ఈ సమస్యను శరభవరానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర ఎమ్మెల్యే కేఎస్ఎన్.రాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఉపాధి హామీలో వంతెన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయించారు. దీంతో రెండు రోజులుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

▸▸ టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి



కొత్తకోటలో పింఛన్లను అందజేస్తున్న నీలవేణి తదితరులు

రావికమతం,డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట నిలబెట్టుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు అని టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి అన్నారు. మంగళవారం కొత్తకోట గ్రామంలో నలుగురు వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ కారణాలతో భర్తలు మృతి చెందగా వారి భార్యలకు తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట గోవిందరావు, ఉగ్గిన శ్రీను, కోట సత్యనారాయణ,వెల్లంకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీపై అధికారుల పర్యవేక్షణ కరువు'

రోలుగుంట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని సీపీఎం మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆరోపించారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చనిపోయిన వైదాసు లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు వైద్యాధికారులు ఉన్నా స్థానికంగా ఉండడం లేదన్నారు. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జలజీవన మిషన్ పనులు పూర్తికి గడువు పొడిగింపు

రావికమతం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్ పథకంలో మంజూరైన పనులు గడువును జూన్ నెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించిందని, ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ భగవంతురావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జలజీవన్ మిషన్‌లో మండలంలో 86 గ్రామాలలో ఇంటింటా కొళాయిల కోసం రూ. 36 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆ పనులు నిర్మాణానికి కాంట్రాక్టు పొందిన వారు ఈ ఏడాది నవంబరు 30లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఇంతవరకు రూ.16 కోట్లు విలువైన 22 పనులు మాత్రమే కాంట్రాక్టర్లు పూర్తిచేశారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లగా వచ్చే ఏడాది జూన్ నెలలోగా పూర్తి చేయాలని గడువు ఇచ్చిందన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

దేవరాపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ. టి మల్లేశ్వరరావు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మైనర్లు వాహనాలు నడిపినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకే మద్యం అమ్మకాలు జరపాలన్నారు.

కొత్త వెలుగులు నింపాలి

» జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు


కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయా రంగాల్లో అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నూతన సంవత్సరం మరో మైలురాయి కావాలని ఆమె అన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ అచ్యుతాపురం మండలం తంతడి పంచాయతీ వాడపాలెం, రాంబిల్లి మండలం సీతంపాలెం బీచ్‌ల అభివృద్ధికి అవసరమైన భూమి అందుబాటులో వుందని, ఇక్కడ సోలార్ లైటింగ్, వాచ్ టవర్ ఏర్పాటుకు పోలీస్ శాఖ ప్రతిపాదనలు చేసిందని, టూరిజం శాఖ నుంచి స్టాల్స్, టాయిలెట్స్ రోడ్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో విస్తరించిన కొండకర్ల ఆవను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయడానికి, పెడల్ బోటు, ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటుకుగల అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో జలపాతాలను గుర్తించి వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి కె.మనోరమ, అడిషనల్ ఏఎస్పీ ఎం.దేవప్రసాద్, ట్రావెల్ అండ్ టూర్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ కె.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగింపు : కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును రెండు నెలల పాటు పొడిగించినట్టు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు కార్డుల కాల పరిమితిని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. అక్రిడిటేషన్ ఉండి పనిచేస్తున్న జర్నలిస్టుల జాబితాను మీడియా సంస్థలు డీపీఆర్వో కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

» సర్పంచులు సహకరించాలి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు

» కొమిరలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

గొలుగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సహకరించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం కొమిర గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురు లబ్ధిదారులకు డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా 63.78 లక్షల మందికి పింఛన్‌ల రూపంలో రూ.2,700 కోట్లు అందిస్తున్నామని చెప్పారు. కొమిర గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.8 లక్షలు, శ్మశానవాటిక అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. గొలుగొండ మండలంలో 145 సీసీ రోడ్ల నిర్మాణానికి గత ఆరు నెలల్లో రూ.7.13 కోట్లు ఇచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్న ఉద్దేశంతో గత ఎన్నికల్లో ప్రజలు కూటమిని గెలిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, టీడీపీ నాయకులు కర్రినాయుడు, చింతల కాంతం, కొల్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


కొమిరలో మహిళకు పింఛన్ నగదు అందిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు


సూక్ష్మ కళతో కొత్త ఏడాదికి స్వాగతం

» పెన్సిల్ ముల్లుపై 2025ను అద్భుతంగా చెక్కిన గోపాల్

మాడుగుల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష కళాకారుడు నైదండ గోపాల్ మరోసారి తన కళాప్రతిభను చాటాడు. పెన్సిల్ ముల్లుపై '2025' అంకెలను చక్కగా చెక్కాడు. దీనిని రూపొందించ డానికి రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ చెప్పాడు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సూక్ష్మ కళాఖండాలు తయారు చేయడం ఇతని ప్రత్యేకత.


పెన్సిల్ ముల్లుపై 2025 (ఇన్‌సెట్‌లో) సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్

చెక్కపై న్యూ ఇయర్


చెక్కతో చేసిన చేతిపై 2025

నక్కపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన కళాకారుడు దార్ల రవి నూతన సంవత్సరం సందర్భంగా చెక్కపై చేతిని తయారు చేసి దానిపై '2025' అంకెను రూపొందించాడు. దీనిని తయారు చేయడానికి గంట న్నర సమయం పట్టిందని చెప్పాడు. వృత్తిరీత్యా కార్పెంటర్ అయిన ఇతను ప్రత్యేక రోజుల్లో ఆయా ఇతివృత్తాలను ఆవిష్కరించేలా కళారూపాలను తయారు చేస్తుంటాడు.

జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి

అనకాపల్లి టౌన్/ కశింకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు ఆలయాల్లో వేంకటేశ్వర స్వామి జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనకాపల్లి గాంధీ నగరం అం జయ్యకాలనీలోని ఆలయంలో ప్రధాన అర్చకులు రేజేటి గోపాలాచార్యులు, వేంకటేశ్వర స్వామికి జగన్మోహిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో తిరుమలలో మలయ్యప్పస్వామికి జగన్మోహిని అలంకరణ చేస్తారని, ఇక్కడ ఆలయంలో స్వామివారిని జగన్మోహిని అవతారంలో అలంకరణలో అలకరించినట్టు ఆయన చెప్పారు. కశింకోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అవతారాన్ని మూడు రోజులపాటు కొనసాగిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


అనకాపల్లి గాంధీనగరంలోని ఆలయంలో జగన్మోహిని అవతారంలో శ్రీవారు


కశింకోట ఆయలంలో జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి

బల్క్ డ్రగ్ పార్కు వద్దు

» రాజయ్యపేట సముద్ర తీరంలో వినూత్న నిరసన

నక్కపల్లి, డిసెంబఋ 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేట తీరం వద్ద మత్స్యకారులు, సీపీఎం నేతలు మంగళవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఇసుక తిన్నెపై 'నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయవద్దు' అని అక్షరాలు రాసి రంగులు అద్దారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నాయకులు ఎం.సత్యనారాయణ, రాజేశ్ మాట్లాడుతూ, విదేశాల్లో నిషేధించిన, కాకినాడ జిల్లా ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి మండలంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ఏర్పాటైన రసాయన, ఫార్మా కంపెనీల నుంచి విడుదల చేస్తున్న వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితమై, మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సోమేశ్, ఎం.భయ్యన్న, సీహెచ్ రాజు, ఎం.జాన్, తదితరులు పాల్గొన్నారు.



బల్క్ డ్రగ్ వద్దంటూ ఇసుక తిన్నెలపై నిరసన తెలుపుతున్న మత్స్యకారులు, సీపీఎం నేతలు

గంజాయి, బెల్ట్ దుకాణాలపై వాడీవేడి చర్చ


సమావేశంలో పోలీసులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

» ఎలమంచిలి మునిసిపల్ సమావేశం

ఎలమంచిలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి, బెల్ట్ దుకాణాలపై మంగళవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ వాడీవేడిగా జరిగింది. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్ మరిణేశ్వరరావు, వైస్ చైర్మన్ గుప్తా పట్టణంలో గంజాయి వినియోగం, బెల్ట్ దుకాణాలు విపరీతంగా పెరిగిపోయాయని, వీటిని అరికట్టాలని కోరారు. గంజాయి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. దీంతో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ పట్టణ, రూరల్ ఎస్‌ఐలను పిలిపించి గంజాయి, బెల్ట్ దుకాణాలను నివారించగలరా? లేదా? అని ప్రశ్నించారు. మీరు చేయలేకపోతే వేరే అధికారులను తెప్పించుకుం టామని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో సీఐ ధనుంజయరావు హాజరై గంజాయి నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ సీఐ తేజోవెంక కుమార్‌తో కలిపి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ సందర్భంగా వీధి లైట్లు, తాగునీటి సమస్య సాగునీటి కాలువలు వంటి సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. రెవెన్యూ సదస్సులపై తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, తనను ప్రజాప్రతినిధిగా గౌరవిస్తే ఉంటామని, లేదంటే రాజీనామా చేసి వెళ్లిపోతామని కట్టుపాలెం కౌన్సిలర్ హరనాథరావు ప్రకటించారు. దీనిపై చైర్‌పర్సన్ రమాకుమారి స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మత్స్యావతారంలో పాండురంగ స్వామి

పాయకరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయంలో మంగళవారం నుంచి స్వామివారి దశావతారాల అలంకరణ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగస్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.దివ్యతేజ, అర్చకులు నారాయణాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


మత్స్యవతారంలో దర్శనమిస్తున్న పాండురంగస్వామి

క్రైం... crime news

టీడీపీ నేతలపై దాడి కేసులో నిందితుల అరెస్టు

చోడవరం/బుచ్చెయ్యపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠ, అతని సోదరుడు శ్రీనివాసరావులపై దాడికి పాల్పడిన బుచ్చెయ్యపేట మండలం వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, అతని కుటుంబీకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. దిబ్బిడికి చెందిన టీడీపీ నాయకులు మణికంఠ, అతని సోదరుడిని కవ్వింపులకు గురిచేస్తూ, వారిపై సోమవారం సాయంత్రం ఆ గ్రామానికే చెందిన వైస్ ఎంపీపీ చినబాబు, అతని కుమారులతో పాటు, ఇతర బంధువులు దారికాచి కర్రలతో దాడి చేసిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. సేనాపతి మణికంఠ తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు గొంపా చినబాబు, సియ్యాద్రి జనార్దన్, రాజేశ్, తేజ, హేమంత్, వర్ధన్‌లపై పలు సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

మహిళను బెదిరించి డబ్బులు అపహరించిన నిందితురాలి అరెస్టు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మహిళను కత్తులతో భయపెట్టి నగదు అపహరించిన కేసులో ఒక నిందితురాలిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు చెందిన ఏపీ జెన్కో ఉద్యోగిని చెక్కా సుధ అక్టోబరు నాలుగో తేదీన గాజువాక వెళ్లడానికి అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో మరో ఇద్దరు మహిళలు వున్నారు. ఆటో జలగలమదుం జంక్షన్ వద్దకు చేరగానే ఇద్దరు మహిళలు కత్తులతో బెదిరించి సుధ నుంచి లక్షా 80 వేల రూపాయల నగదును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్‌ను అప్పట్లోనే అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితుల్లో ఒకరైన గంటా కాళేశ్వరిని సుంకరమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈమె స్వస్థలం విజయనగరం జిల్లా కొత్తవలస. ఈ కేసులో మరో నిందితురాలి కోసం గాలిస్తున్నామని పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

పాదచారిని ఢీకొన్న బైక్.. ఇద్దరికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన సాయి

కోటవురట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల పంచాయతీ రాట్నాలపాలెం గ్రామానికి చెందిన బుకా అర్జుమ్మ నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొనడానికి చర్చికి నడుచుకుంటూ వెళుతున్నది. ఇదే సమయంలో కైలాసపట్నం గ్రామానికి చెందిన మాటూరి సాయి అనే యువకుడు బైక్‌పై వేగంగా కోటవురట్ల వెళుతున్నాడు. స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో వేగాన్ని నియంత్రించలేక, అర్జునమ్మను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆమె కాలు విరిగిపోయింది. సాయి రోడ్డుపై పడిపోవడంతో తలకి బలమైన గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

» ఉమ్మడి విశాఖ జిల్లాకు నాలుగు పతకాలు



జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు

చోడవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కోల్‌కతాలో నిర్వహించిన 5వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్ పోమ్‌సే విభాగంలో విశాఖ సిటీ ఆరిలోవకు చెందిన తన్విత్ బంగారు పతకంతోపాటు, క్యోరుగి అండర్ 32 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ఆరిలోవకు చెందిన జి.కారుణ్య ప్రసాద్ కేడెట్ డివిజన్ పోమ్‌సే వ్యక్తిగత విభాగంలో రజత పతకం, డివిజన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు.

ఎక్స్ అఫీషియో సభ్యునిగా అయ్యన్న ప్రమాణం

... 7వ పేజీ తరువాయి

మునిసిపాలిటీకి రూ.4.16 కోట్లు మంజూరు చేయించి అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించామని చెప్పారు. జనవరిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్లు, ఫిబ్రవరిలో ప్రభుత్వం నుంచి రూ.5 కోట్లు మంజూరు చేయించనున్నట్టు అయ్యన్నపాత్రుడు తెలిపారు.ఈ నిధులతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, దీనికి సంబంధించి సమావేశాంలో తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నానని, ఎంత మంది మద్దతు తెలుపుతున్నారో చేతులు ఎత్తాలని కోరారు. టీడీపీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు, జనసేన నుంచి ఒకరు, వైసీపీ రెబల్ కౌన్సిలర్ ఒకరు, ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్‌తో కలిపి 17 మంది చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు.


కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

పెరిగిన నేరాలు!

... 7వ పేజీ తరువాయి

మద్యం స్వాధీనం చేసుకొని 2,461 కేసులు నమోదు చేసి, 2,050 మందిని అరెస్టు చేశారు. 38 వాహనాలు సీజ్ చేశారు. జిల్లాలో 2023లో 57 సైబర్ నేరాలు నమోదు కాగా 2024లో 103 కేసులు నమోదయ్యాయి.

మాదకద్రవ్యాల రహితంగా తీర్చి దిద్దడేమ లక్ష్యం: ఎస్పీ


తుహిన్ సిన్హా

జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని, ఆ దిశగా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తున్నదని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఐదు చెకిపోస్టులు, 11 డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీతోపాటు డ్రోన్‌లతో నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. పోక్సో చట్టం, మహిళా రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లపై విద్యాలయాల్లో వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించామని తెలిపారు. రహదారి భద్రత చర్యలు చేపట్టి ప్రమాదాలు తగ్గించేందుకు కృషి చేశామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574